## క్లుప్తంగా

### సత్కారం అందుకున్న ప్రవచనకారులు



ప్రవచనకారులను సత్కరిస్తున్న అధికారులు

రాజంపేట : తిరుమల – తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనలు బోధించే నాగసరాల నారాయణ, గంగసపల్లి వెంకటరమణలను బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. మండలంలోని తాళ్లపాక గ్రామంలో వెలసిన శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ప్రవచనకారులైన నారాయణ, వెంకటరమణలు భగవద్గీత పారాయణం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రోజుకో అధ్యాయం చొప్పున 18 రోజులపాటు 18 అధ్యాయాలను బోధించారు. ఈ సందర్భంగా వారిని జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపిబాబు, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు కొత్త నరసింహులు, ఆలయ అర్చకులు నరేష్‌లు శాలువా, పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు.

### నూలివీడు పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ లక్ష్మానాయక్

గాలివీడు : మండలంలోని నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత ఆయన రికార్డులను, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించి, ఆస్పత్రి సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు సరైన వైద్యం అందించాలన్నారు. అదే విధంగా మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రైడే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి జ్వర సంబంధమైన సర్వేలను నిర్వహించాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యులు శంకర్ నాయక్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌ఎమ్‌ఓ ఆఫీస్ నుంచి ఎంపీహెచ్ఈఓ నిత్యపూజయ్య, నూలివీడు పీహెచ్‌సీ సిబ్బంది దేవేంద్రారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ప్రసాద్, అహమ్మద్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛంద సేవలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్/ లక్కిరెడ్డిపల్లి : స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు పి.శివారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని కంసలవీధిలోని హరి పాపులర్ షూ కంపెనీ షాపులో దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత మిక్కిలినేని ప్రసాద్‌నాయుడు ఆర్థిక సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. దుప్పట్లను ఉపాధ్యాయుడు రామమోహన్‌రెడ్డి దాతలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ జీఎంటి కో–ఆర్డినేటర్ పీఎస్ హరినాథరెడ్డి, జోన్ చైర్మన్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ అధ్యక్షుడు చాన్‌బాషా, కోశాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి, సభ్యుడు పవన్‌కుమార్‌తోపాటు పాపులర్ షూ కంపెనీ సిబ్బంది, దివ్యాంగ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.కృష్ణారెడ్డి అత్త దండు సుబ్బమ్మ దశదిన కర్మకాండలో గురువారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పాల్గొని మృతురాలు దండు సుబ్బమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నరసారెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**నాగా పిచ్చిరెడ్డికి ఘన నివాళి**

పుల్లంపేట : మండలం పరిధిలోని కోనేయ్యగారిపల్లి సర్పంచ్ నాగా పిచ్చిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి నాగా పిచ్చిరెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగా పిచ్చిరెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ పండుగ.. ఆనందాల వేడుక

- 25న ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబవుతున్న చర్చిలు
- సెయింట్ జాన్ లూథరన్ చర్చి వద్ద పండుగకు భారీ ఏర్పాట్లు
- క్రిస్మస్ క్యారెల్స్‌తో మొదలైన సందడి
- వివిధ సేవా కార్యక్రమాలను చేయనున్న క్రైస్తవ సంఘాలు



ముస్తాబైన లూథరన్ చర్చి



విద్యుత్ దీప కాంతులలో దేదీప్యమానంగా సెయింట్ లూథరన్ చర్చి

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు పట్టణం క్రిస్మస్ కళను సంతరించుకుంటోంది. ఈ నెల 25న క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చర్చిలు ముస్తాబవుతున్నాయి. స్టేషన్‌రోడ్డులోని హోసన్నా, తిరుపతి రోడ్డులోని చర్చిలు, అలానే టోల్‌గేట్ వద్దనున్న పురాతన చర్చిలలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని చర్చిలను రంగులు, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. క్రిస్మస్ ట్రీలు, క్రీస్తు జన్మ ఇత్తివృత్తాన్ని తెలిపేలా పశువుల పాకలను తీర్చిదిద్దుతున్నారు. అలానే క్రిస్మస్ అనంతరం ఆయా సంఘాలలోని పిల్లలకు బైబిల్ పోటీలు, ఆటలు, పాటలు, క్రీడా పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

**చారిత్రాత్మకం.. సెయింట్ జాన్ లూథరన్ చర్చి**

రైల్వేకోడూరులోని 1882 సంవత్సరం నాటి పురాతన సెయింట్ జాన్ లూథరన్ చర్చి బ్రిటీష్ కాలం నాటి చరిత్రకు నిదర్శనంగా నిలిచిపోయింది. నేటికీ ఈ చర్చి చెక్కు చెదరకుండా క్రైస్తవ సంప్రదాయాలకు అలనాటి భక్తి విశ్వాసాలకు నిలువుటద్దంగా నిలుస్తోంది. అప్పటి సంఘ వ్యవస్థాపకులు జోహన్ వర్లీన్ ఆధ్వర్యంలో 1882లో లూథరన్ చర్చిని నిర్మించారు. ఇక్కడ ఉన్న క్రిస్టియన్ మిషనరీ ద్వారా ఎందరో విదేశీయులు ఇక్కడికి వచ్చి ప్రార్థనలు చేసేవారు. అప్పటి నుంచి నేటి వరకు ఈ చర్చిలో వేలాది మంది క్రైస్తవులు ప్రతి ఆదివారం ప్రార్థనల్లో పాల్గొంటారు. ఎందరో గొప్ప వ్యక్తుల్లు ఇక్కడ పాస్టర్లుగా సేవలు అందించారు. వీరిలో విదేశీయులు 28 మంది, స్వదేశీయులు 9మంది పాస్టర్లుగా వ్యవహరించారు. పురాతన, చారిత్రక విశిష్టత ఉన్న లూథరన్ చర్చి క్రిస్మస్ ప్రార్థనలకు సంఘ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

**మిషనరీ ద్వారా పేదలకు పలు సేవలు**

క్రైస్తవ మిషనరీల ద్వారా ఎన్నో పాఠశాలలు నిర్మించారు. అలాగే గ్రామాలలో పేదలకు ఎన్నో వైద్య సేవలు చేసి బ్రిటీషులు ఇక్కడి వారి మనసులు గెలుచుకొన్నారు. దీంతో అనేక చర్చిలు, పాఠశాలలు ఏర్పాటయ్యాయి. తరువాత 1950 వరకు సాధారణంగా ప్రార్థనలు చేసుకొనేవారు. రోజురోజుకు ఆదరణ పెరగుతుండటంతో 1951లో చర్చి పాస్టర్‌గా ఉన్న కలపాటి దేవదాసు చర్చికి అనుసంధానంగా ఎస్‌ఎల్‌సీ పాఠశాలను ప్రారంభించారు. అప్పట్లో జె హెన్రీ మేయర్ అనే వ్యక్తి ఇక్కడకు వచ్చి మిషనరీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలకు సహకారం అందించారు. ఇందులో భాగంగానే జ్యోతీకాలనీలో సంఘం తరపున కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్యశాల, హెచ్‌ఎమ్‌ఎమ్ హైస్కూల్ నిర్మించి ప్రజలకు సేవలందించారు.



క్రిస్మస్ క్యారెల్స్‌లో పాల్గొన్న పాస్టర్, సంఘు సభ్యులు

**క్యారెల్స్ సందడి మొదలు**

క్రైస్తవులు, విశ్వాసులకు విశిష్టమైన పండుగ క్రిస్మస్. అలాంటి క్రిస్మస్ నెల రోజుల ముందు నుంచి అంటే నవంబర్ 25 (సపోజ్ క్రిస్మస్) నుంచి సందడి మొదలవుతుంది. క్రిస్మస్ పర్వదినానికి వారం రోజుల ఉన్నప్పటి నుంచి క్రిస్మస్ క్యారెల్స్ సందడి మొదలవుతుంది. పాస్టర్‌లు, సంఘ పెద్దలు, యువత క్రైస్తవ కీర్తనలను ఆలపిస్తూ చర్చిలో సభ్యులుగా ఉన్న వారి ఇళ్లకు వెళ్లి క్రిస్మస్ పండుగ, నూతన సంవత్సవర శుభాకాంక్షలు తెలుపుతుంటారు. సాయంత్రం మొదలయ్యే ఈ కార్యక్రమాలను అర్ధరాత్రి దాటే దాక సాగుతుంటాయి. క్యారెల్స్‌లో పాల్గొన్న వారికి ఆయా కుటుంబసభ్యులు స్వీట్లు, కేక్ అందజేస్తూ క్రిస్మస్ శుభములు తెలియజేసుకుంటూ ఉంటారు.

**చారిత్రక చర్చి ఉండడం మా అదృష్టం**



పట్టణంలో చారిత్రక చర్చి ఉండటం మా అదృష్టం. ప్రతి ఏడాది వచ్చే పవిత్రమైన క్రిస్మస్‌ను క్రైస్తవ సోదరులమంతా ఎంతో ఘనంగా నిర్వహించుకుంటాం. మూడు రోజులపాటు సెయింట్ లూథరన్ చర్చి ప్రాంగణంలో ఏర్పాట్లు చేసి ప్రతి ఒక్కరూ కలిసి ప్రార్థనలు చేస్తాం. క్రిస్మస్ రోజు చేసే ప్రార్థనలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది.

– విజయభాస్కర్, కమిటీ సభ్యుడు, లూథరన్ చర్చ్, రైల్వేకోడూరు

**మిషనరీ ద్వార సేవా కార్యక్రమాలు**



ఈ చర్చి నిర్మాణం అయ్యాక ఎందరికో ఆశ్రయం కల్పించింది. అప్పటి నిర్వాహకులు ఈ ప్రాంతంలో అనేక చర్చిలు, పాఠశాలలు ఏర్పాటు చేసి ఎందరినో ఉన్నత స్థాయికి చేరేలా తోడ్పాటునందించారు. జె హెన్రీ మేయర్ అనే వ్యక్తి ఇక్కడకు వచ్చి మిషనరీ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని సంఘం తరపున సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– కేసీ చంద్ర, కమిటీ సభ్యుడు, లూథరన్ చర్చ్, రైల్వేకోడూరు

### గుంతలమయమైనా గమ్మునుండారే!

పెనగలూరు : మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న వినాయక నగర్ రోడ్డు గుంతలమయమైంది. మెయిన్ రోడ్డు నుంచి వినాయక నగర్ వాసులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలోనే మీసేవా కేంద్రం కూడా ఉంది. పంచాయతీలో నాయకులు అనేక మంది ఉన్నా రోడ్డు వేసేందుకు మాత్రం ఎవరూ చొరవ చూపకపోవడం విశేషం. చిన్నపాటి వర్షం పడితే చాలు ఈ రోడ్డు గుంతలమయం అవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వినాయక నగర్‌లో రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయమైన వినాయక నగర్ రోడ్డు

## హాస్టల్ భవనాన్ని వెంటనే పూర్తిచేయాలి



అర్థాంతరంగా నిలిచిన హాస్టల్ పనులను పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : పట్టణంలోని సుండుపల్లె మార్గంలో నిర్మాణ దశలో ఉన్న బీసీ బాలుర వసతి గృహాన్ని వెంటనే పూర్తిచేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి అర్థాంతరంగా ఆగిన భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో ఎంతోమంది చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. కాగా శిథిలావస్థకు చేరుకున్న భవనం స్థానంలో నిర్మిస్తున్న నూతన భవనం నిర్మాణ పనులను ఏళ్ల తరబడి అసంపూర్తిగా వదిలేయడం దారుణమన్నారు. దీంతో భవనం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు సైతం ఊరికి దూరంగా సద్దికూళ్లవంక వద్ద ఉన్న భవనంలో ఉంటూ పాఠశాలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బీసీ వసతిగృహ సంక్షేమశాఖ అధికారులు వెంటనే భవననిర్మాణం పనులు పూర్తిచేయించి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఏరియా అధ్యక్షుడు కార్తిక్ నాయక్ పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల కూలీని పెంచాలి



కార్మికులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకురాలు భాగ్యలక్ష్మి

రాయచోటి అర్బన్ : బీడీ కార్మికులకు కూలీ రేట్లను పెంచాలని, వెయ్యి బీడీలు చుట్టినందుకు కూలీ రూ.500లు చెల్లించాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ డి.భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం ఆమె పట్టణంలోని పాత రాయచోటిలోని బీడీ కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీడీ యాజమాన్యాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయన్నారు. వెయ్యి బీడీలు చుట్టిన కార్మికులకు కేవలం రూ.260లు చెల్లించడాన్ని తప్పుబట్టారు వారికి వెయ్యి బీడీలు చుడితే యాజమాన్యాలు రూ.500లు చెల్లించాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలతో కూలీలు తమ కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక రోగాల బారిన పడే కార్మికుల కోసం యాజమాన్యాలు ఆరోగ్యబీమాను చెల్లించాలన్నారు. కార్మికుల కోసం నిర్వహించే డిస్పెన్సరీని వెంటనే పునరుద్ధరించడంతోపాటు వారి పిల్లల చదువుల కోసం స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలంటూ డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులందరికి గుర్తింపు కార్డులు అందజేయాలంటూ కోరారు. లేదంటే యాజమాన్యాలపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికులు జైబూన్, షాహినా, మస్తాని తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న అధికారులు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట, మాధవరం –1 గ్రామాల్లో గురువారం అక్రమ కట్టడాలపై అధికారులు కొరడా ఝులిపించారు. మండలంలోని భాకరాపేట గ్రామంలో ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమె మాట్లాడుతూ అక్రమ కట్టడాలను తొలగించాల్సిందిగా కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆదేశాల మేరకు పోలీసుల సహాయంతో అక్రమ కట్టడాలను తొలగించినట్లు తెలియజేశారు. మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ సర్వేనెంబర్ 641/1లో భాకరాపేట గ్రామానికి చెందిన తుర్రా సుబ్బలక్షుమ్మ ప్రభుత్వ వంక పరంబోకు స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణాలను చేపట్టిందన్నారు. అలాగే మాధవరం–1 గ్రామం సర్వేనెంబర్ 864/7లో గ్రామ సచివాలయం–2 సమీపంలో వంక పరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనాన్ని నిర్మించారన్నారు. ఆయా నిర్మాణాలపై పలువురు ఫిర్యాదు చేయడంతో భవనాలను తొలగించామని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ శ్యాంబాబు, రజనీ, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపు ఎంతో అవసరం



మాట్లాడుతున్న డీఈఈ నాగమణి స్వామి

లక్కిరెడ్డిపల్లి : విద్యుత్ పొదుపు చేయడం ఎంతో అవసరమని విద్యుత్ డీఈఈ నాగమణి స్వామి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని నలందా హైస్కూల్‌లో విద్యార్థులకు విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటిలో వాడే విద్యుత్ పరికరాలను, వాటి విధి, విధానాలను విద్యార్థులకు విపులంగా వివరించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ హరినాథ్ మాట్లాడుతూ పిల్లలు భావితరాలకు పెన్నిధి వంటి వారని, వారు విద్యుత్ పొదుపు చేసుకునే పద్ధతులు ఇప్పటి నుంచే తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. నలంద హైస్కూల్ కరస్పాండెంట్ ఏఎస్ బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యుత్ పొదుపు ఎంతో ఆవశ్యకమని, విద్యార్థులందరూ దీని గురించి విధిగా తెలుసుకొని ప్రతి విద్యార్థి విద్యుత్‌ను పొదుపు చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రమణ, విద్యుత్ సిబ్బంది బాబ్జాన్, మల్లికార్జున, వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమైన దేవాలయ భూములను గుర్తించండి

- వివిధ రెవెన్యూ సమస్యలపై అర్జీలు అందజేసిన ప్రజలు
- ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామన్న రెవెన్యూ అధికారులు



చిన్నమండెం: అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి చంద్రానాయక్, తహసీల్దార్ నరసింహులు



సుండుపల్లె: అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



సిద్దవటం: మాట్లాడుతున్న కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్

సుండుపల్లె : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాడానికి సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ దైవాదీనం పేర్కొన్నారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో మండల ప్రత్యేక నోడల్ అధికారి జయరాముడు ఆధ్వర్యంలో సుండుపల్లె–1 పంచాయతీ గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దైవాదీనం మాట్లాడుతూ ప్రజలకు ఉన్నటువంటి సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండల దేవాదాయశాఖ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ శ్రీ చౌడమ్మ దేవత భూమి సర్వే నెంబరు. 544లో 2.73 ఎకరాలు, 2335లో 24 సెంట్లు, శ్రీ అరివమ్మ దేవత ఆలయ భూములు సర్వే నెంబరు 1867లో 14 సెంట్లు, 1391లో 1.92 ఎకరాలు అన్యాక్రాంతమైందని, దానిని సర్వే చేయించి దేవాలయాలకు అప్పగించాలని అర్జీ ద్వార తెలియజేశారు. ఈ గ్రామసభకు 33 అర్జీలు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు నాయక్, వీఆర్ఓ బసయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నమండెంలో..**

చిన్నమండెం : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో రెవెన్యూ గ్రామసభలను గురువారం నిర్వహించినట్లు తహసీల్దార్ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి చంద్రానాయక్ ప్రజల నుంచి పలు సమస్యలపై వచ్చిన 272 అర్జీలను స్వీకరించారు. త్వరలోనే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్యామల, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిబాబు, ఈఓ కొండారెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**సిద్దవటంలో..**

సిద్దవటం : రైతుల భూసమస్యలకు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ తెలిపారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో రెవెన్యూ సదస్సులో గురువారం ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. రైతులు భూ సమస్యలపై ఇచ్చిన అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామ సచివాలయ పరిధి వంక పరంబోకు, ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేసి గృహాలు నిర్మించుకున్నారని ఆ ప్రాంతవాసులు ఆర్డీఓ దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం చేసి ఉంటే తొలగించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుర్ర చిన్నక్క, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ జయసింహ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాధవీలత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సర్వేయర్ సుదర్శన్, వీఆర్‌ఓలు రజనీ, శ్యాంబాబు, రేణుక, గ్రామ సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్ నాయుడు, ఉప సర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా సర్వే



ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా సర్వే చేస్తున్న అధికారులు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, కొత్తపల్లి బస్టాండ్‌కు సంబంధించి సర్వేను గురువారం ముమ్మరంగా చేపట్టారు. పెనగలూరు ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న అద్దె గదులు ఆక్రమించి ముందుకు వచ్చారని ఓ వ్యక్తి గ్రామ సదస్సులో తెలపడంతో సర్వేయర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో గురువారం సర్వే చేపట్టారు. వెంకయ్య స్వామి ఆలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు సర్వే చేసి గుర్తులు వేశారు. కొన్నిచోట్ల గదులు సగం వరకు ఆక్రమణలో ఉన్నట్టు తేలింది. దీంతో శుక్రవారం కూడా సర్వేచేసి గుర్తులు వేయనున్నట్లు సర్వేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్‌లు, వీఆర్ఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జాబ్ మేళా

నందలూరు : మండల కేంద్రంలోని ఆకేపాడు క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శుక్రవారం (నేడు) ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎం శ్రీహరి తెలియజేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అన్నమయ్య జిల్లా ఉపాధి కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (ఎస్ఈఈడీఏపీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో ఐసీఐసీఐ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువతీయువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్ పోర్టు సైజు కలర్ ఫొటోలు తమవెంట తీసుకురావలెనని చెప్పారు. పూర్తి వివరాలకు 96767 36623 నెంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## హెల్మెట్ బరువు కాదు బాధ్యత

అవగాహన ర్యాలీ నిర్వహించిన పోలీసులు



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచోటి టౌన్ : ద్విచక్రవాహనంపై ప్రయాణం చేసేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణంలోని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. చెక్‌పోస్ట్ వద్ద నున్న శివాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని అర్బన్ సీఐ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అర్బన్ సీఐ మాట్లాడుతూ హెల్మెట్ బరువు అనుకోరాదని బాధ్యతగా భావించాలని చెప్పారు. ప్రమాదాలలో చాలా మంది హెల్మెట్ లేని వారే మృత్యువాత పడుతున్నారన్నారు. అందుకే ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని చెప్పారు. నిర్లక్ష్యంతో మరణాన్ని తెచ్చుకొని కుటుంబాలను అనాథలుగా చేయవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలని తెలియజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు, శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యంతో పాటు స్వచ్ఛందంగా స్థానిక ప్రజలు హెల్మెట్ ధరించి వాహన ర్యాలీలో పాల్గొన్నారు.

## 'కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి'

లక్కిరెడ్డిపల్లి: పార్లమెంటు శీతాకాల సమావేశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దప్పేపల్లి గ్రామం జాండపల్లిలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, అటువంటి మహోన్నత వ్యక్తిపై పార్లమెంట్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే ఆందోళన కార్యక్రమలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అమిత్ షా స్పందించి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

### వినియోగదారులు హక్కులను తెలుసుకోవాలి

సంబేపల్లె : వినియోగదారులందరూ తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సంబేపల్లె జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ కన్జూమర్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండు సూది నుంచి విమాన ప్రయాణం వరకు ఖర్చు చేసేవారంతా వినియోగదారులేనన్నారు. తాగే నీరు, పాలతోపాటు కొనుగోలు చేసే వస్తువుల నాణ్యతపై ప్రతి ఒక్కరూ ప్రశ్నించేతత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. వస్తువు ధర, గడువు, తేడాలను గమనించాలన్నారు. సిలిండర్, పెట్రోల్ బంక్‌లలో వినియోగదారులపై ఆ సంస్థ అన్నమయ్య జిల్లా వైస్ ప్రెసిడెంట్ సురేంద్రారెడ్డి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.